# మమత

రచన:
కుమారి తాళ్ళూరు పర్వతవర్ధని.

(గత సంచిక తరువాయి)

'లేరు, నీతో ఒకవిషయం మాట్లాడాలి. ఏమన్నా పనుందా?'

'ఊహు!—ఏం లేదమ్మా!' నమ్రతగా బదులిచ్చింది రాజా.

'అతను రావటంలేదేం?'

ఆశ్చర్యంతో ప్రశ్నార్థకంగా తల్లివైపు చూసింది రాజ.

'రాజా! నేనడిగిన దానికి సూటిగా సమాధానం చెప్పు.'

— — — — —

'మీరిద్దరూ ప్రేమించుకున్నారా?

రెండో ప్రశ్నకు కూడా మౌనంగా తల వంచుకుంది రాజ.

'భయంలేదు, నిజం చెప్పు రాజా' అనునయంగా అడిగింది సుభద్ర.

తల్లి ప్రవర్తన అర్థం కాక అయోమయంగా కూర్చుంది రాజ.

'హు! అర్థమయింది రాజా! కానీ ఒక్క మాట చెబుతున్నాను విను—ఏలాంటి విభేదాలు లేక పెద్దల అంగీకారంతో జరిగిన ప్రేమ వివాహాలే కొన్ని విఘ్నమైపోతున్నాయి. ఇక మీ ఇద్దరి విషయమంటావా? అతనికి నీకు అంతస్తుల్లో చాలా వ్యత్యాసముంది. ఇక పెద్దల అంగీకారమంటావా?—చాలవరకు లేదనే చెప్పవచ్చు. అతని పరిస్థితిని చూస్తే శ్రీమంతుడిలా కన్పిస్తుంది. అలాంటివానికి దమ్మిడీ కట్నం లేకుండా కేవలము డిగ్రీని చూచి వివాహానికి ఒప్పుకుంటారంటే అది కల్ల. ఈనాడు నీ అందాన్ని చూచి భ్రమించి పెండ్లి చేసుకున్నా రేపు పెద్దవాళ్ళ అంగీకారం తీసుకొని నిన్ను వదిలేయవచ్చు—' భారంగా ఆగింది సుభద్ర.

'అమ్మా'—అంతవరకూ తల్లి ఉద్దేశ్యం అర్థంకాక వింటున్న రాజా ఆ మాటతో తెలివి తప్పినంతపనైంది.

'ఏం అబద్ధమంటావా?''

'కాదు—కానీ అతను మాత్రం అలాంటివారు కాదు. నీతో మాట్లాడి పెద్దల అంగీకారం—'

'భ్రమ రాజా భ్రమ'— నీవింకా చిన్నదానవు అనుభవంతో చెబుతున్నాను, విను.

'ఏమయినా అతను మాత్రం అలాచేయరు నాకా విశ్వాసం వుంది.'

'రాజా! ఈ పెండ్లి జరగడానికి వీలులేదు' ఖండించింది సుభద్ర.

'అమ్మా! — బాధగా అశ్రునయనాలతో అరిచింది రాజ.

అవునమ్మా! నా బాధ నీకెలా తెలుస్తుంది ఒక్క విషయం చెబుతాను విను. నీ జననం నీకు తెలియదు. బియ్యే. చదువుతున్న రోజులవి. శేఖర్‌తో పరిచయం ఏర్పడింది అతను నాకంటే సీనియర్. యవ్వనంలో వున్న మాకు పరిచయం ధృవడింది—హు! ఆ పరిచయమే ప్రేమగా మారి దట్టంగా అల్లుకుపోయింది. మా వివాహానికి పెద్దలు అనుమతించరని నిశ్చయం కావటంతో మా వివాహం రహస్యంగా వేరే వూరిలో జరిగిపోయింది. శేఖర్ ఒక్కగానొక్క కొడుకు కావటంతో ఏనాటికైనా దరిచేరుస్తారనే నమ్మకంతో సాహసించారు శేఖర్. సంవత్సరానికి మా ప్రేమకు ప్రతిరూపం వెలిసింది.

ఒకనాడు సరదాగా పిక్‌నిక్ పోదామని పోయి ఒక హోటల్‌లో దిగాము. ఆనాడు ఎంతో హాయిగా గడిచిపోయింది కానీ ..తిరిగి తెల్లవారి వారు గదిలో కనిపించలేదు. బయటకు వెళ్ళారనుకొన్న నాకు వారి సూట్‌కేస్ కూడా కనిపించక పోవడంతో ప్రపంచం తల్లక్రిందు లయింది. నా బ్రతుకు సర్వనాశనం అయింది. వారికోసం నిరాశతో ఎదురుచూస్తున్న నాకు రెండు రోజుల తరువాత గదులు ఖాళీ లేనందున నన్ను ఖాళీ చేయమన్నారు హోటలువాళ్ళు. రెండు రోజులు ఆగమన్నాను కానీ ఈ పాడు ప్రపంచం నీచంగా చూసింది నన్ను.

'తెచ్చినవాడు వదిలేశాడు...ఇంకెవరి కోరకో ఎదురుచూస్తూన్నట్లున్నావు, ఇక్కడ నీ వ్యాపారం సాగదు వేరేచోటుకు వెళ్ళు'—భగవాన్ ఇక ఆ పాడు మాటలు వినలేక ఆరునెలల పాపను ఎత్తుకొని వస్తూన్న నన్ను అద్దె కట్టమన్నారు. నా దగ్గర డబ్బు ఎక్కడిది? ఈ విషమ పరిస్థితిని ఎలా ఎదుర్కోవటం? అని ఆలోచిస్తున్న నాకు మేనేజరు హెచ్చరికతో చేతులలోని బంగారు గాజులు గుర్తుకువచ్చాయి. ఒక గాజు యిచ్చి వెళ్ళబోతున్న నన్ను 'ఆగు' అంటూ మేనేజర్ గర్జించాడు. గది అద్దె ఇచ్చావు, భోజనానికి ఇవ్వకుండానే వెళ్తున్నావంటూ ఇంకో గాజుకూడా తీసుకున్నాడు.

మండు టెండలో పసిబిడ్డతో ఆకలిదప్పులతో అలమటించిపోయాను. ఆకలితో గిలగిల తన్నుకుంటున్న బిడ్డ. ఎంత ద్రోహం? పిక్నిక్కని తీసుకువచ్చి ఎంత మోసం చేశారు? అవును. నమ్మినవారిని అప్రదిష్టపాలు చేసి పారిపోయి వచ్చిన నాకు మంచి శాస్తి జరిగింది. నా జీవితం ఏం కాను? నా బ్రతుకుకతోడు ఒక బిడ్డ, హే! భగవాన్ స్త్రీని ఎంత నీచంగా సృష్టించావయ్యా? అని విలపించాను. కానీ నా రోదన ఆలకించే వారెవరు? సాహసించి మెడలోని గొలుసు కుదువబెట్టి యాభై రూపాయలు తీసుకుని ఆకలి తీర్చుకుని పాపకు పాలుపట్టి మా వూరికి ప్రయాణమయ్యాను.

కానీ దురదృష్టం నన్ను తరుముకొస్తుంటే ఎంత సాహసించినా ఏమి లాభం? విధి వ్రాత ఎవరు తప్పించగలరు? చెకింగ్ ఇనస్పెక్టర్‌కి టికెట్ చూపబోతే ఏది? నాకంటే నిర్భాగ్యులెవరో ముఫ్ఫైరూపాయలు టికెట్టుతో సహా కొట్టేశారు. హు! గుడ్డి ప్రపంచం నిజానిజాలు తెలుసుకునే ఓపిక లేదు. నరంలేని నాలుక ఎన్నయినా వాగుతుంది. కులటనని బిరుదిచ్చిన సంఘం అది చాలక దొంగనని, వంచకినని రైలునుండి గెంటేశారు. కళ్ళల్లో నీళ్ళు కూడా ఇంకిపోయాయి. నిర్జీవ ప్రతిమనై నిలుచున్నాను. ఎవ్వరినీ దూషించాలన్న కోరిక కలగలేదు. యాంత్రికంగా కదలిపోతున్నాను. అలా ఎంతసేపు నడిచానో నాకే తెలియదు. తెలియకుండానే అప్రయత్నంగా కెవ్వున కేక వేసి పడిపోయాను అంతే!

తిరిగి బెడ్ మీద తెలివి వచ్చిన నేను కళ్ళు విప్పి చూచేసరికి ఎదురుగా వున్న వ్యక్తిని చూచి ఆశ్చర్యం బాధ కలిగాయి. ఎవరో కాదు వారి ప్రాణస్నేహితులు కృష్ణారావుగారు. వారికి నా ముఖం చూపించలేక అశ్రునయనాలతో ప్రక్కకు వెళ్ళాను. వారు ఎంతో వాత్సల్యంతో ఆదరించి ఓదార్చారు. తరువాత తెలిసింది వారు ఆ వూరిలో లాయరుగా ప్రాక్టీసు చేస్తున్నారని వారి కారు క్రిందనే నేను పడిందని. భగవాన్ ఇంకా ఎందుకు బ్రతికించావని విలపించాను.

వారివలననే తిరిగి జీవితంపై ఆశ కలిగింది. ఎలాగైనా నిన్ను అభివృద్ధిలోకి తీసుకువచ్చి నిన్నైనా సుఖపెట్టాలని హెచ్చరించి ప్రోత్సహించారు. అప్పటినుండి మన బరువు బాధ్యతలు వారే చూస్తున్నారు. ఈనాడు నీవు నేను ఈ స్థితిలో వున్నామంటే యిది అంతా వారి దయే... రాజా ఇక నీ ఇష్టం మామయ్య ఆశయం నెరవేరుస్తావో నీ కోరికలకు లొంగిపోతావో? అది నీకే మిగిలింది.

'రాజా! ఈ అభాగ్యురాలి జీవిత గాథ ఇది ధనవంతుల్లోని నీచ గుణం నీకు తెలియదు. అలా అని అందరినీ అంటానికి వీలులేదు. కానీ కొందరికి హృదయాలు వుండవు. కన్నెలనను చెరచి వారి కోరికలు తీర్చుకోవటమే వారి ధ్యేయం. వారి నిజస్వరూపం మొదట మనం తెలుసుకోలేం. నాలాకాక నీవు కలకాలం ఆనందంగా వుండాలనే మా కోరిక రాజా నా మాట విను...

'అలాగే అమ్మా! ఇక నీ మాట కాదనను కానీ...' అంతవరకు దుఃఖాన్ని నిగ్రహించుకున్న రాజా ఇక ఆపుకోలేక ముఖం దాచుకుంది.

'చెప్పు రాజా సందేహించకు' అనునయంగా కూతురి తల నిమురుతూ ప్రశ్నించింది సుభద్ర.

'అమ్మా నాది ఒక్క కోరికమ్మా'... నాకు వివాహం మీద ఇచ్ఛలేదు. ఇక ఎప్పటికీ వివాహ ప్రసక్తి ఎత్తకు.'

'రాజా! నీకేమన్నా మతిపోయిందా?' ఆశ్చర్యంగా ప్రశ్నించింది సుభద్ర.

'ఇంకా లేదమ్మా కానీ పురుషులెలా చేసినా స్త్రీ ఒక్కసారే ప్రేమిస్తుంది. ఆ ప్రేమ విలువ నీకు బాగా తెలుసుననుకుంటాను' అంటూ ఇక అక్కడ నిలువలేక తన గదిలోకి పరుగెత్తి విసురుగా గది తలుపులు వేసుకోవటం స్పష్టంగా విన్న సుభద్ర కుప్పగా కూలిపోయింది.

* * *

'ఇంకా నీ కనుమానమేనా?'

...............

వాడెంతగా కుమిలిపోతున్నాడో అర్థం చేసుకో! వాడి ధోరణి చూస్తుంటే ఆలశ్యం అయ్యేకొద్ది పరిస్థితి విషమించేలా వుంది. మనమే వాడ్ని అపార్థం చేసుకున్నామేమో?...

'కృష్ణా!' గది బయటినుండే పిలిచాడు రాజశేఖర్.

'లోపలికి రా రాజా!'

'ఫరవాలేదు వెళ్ళుతున్నానని చెప్పి పోవటానికి వచ్చాను...'

'రాజా! ఏమిటా మాటలు? నేనంత పరాయివాడ్నయానా?' అంటూ ఒక్క అంగలో స్నేహితుడ్ని చేరి లోపలికి తీసుకువచ్చారు.

కృష్ణా నీకు తెలియదు ఈ ప్రపంచంలో నాలాంటి నిర్భాగ్యులు వుండరేమో? అసలు వుండకూడదనే తలుస్తాను. శెలవ్...'జానకీదేవి' శెలవ్ అంటూ నాలుగు

(తరువాయి 20వ పేజీలో)

(6వ పేజీ తరువాయి)

అడుగులు వేసిన వాడల్లా ఆగిపోయాడు.

'ఆగండి! మిమ్మల్ని అపార్థం చేసుకున్నాను. ఈ పాపిని క్షమించండి' అంటూ రాజశేఖర్ పాదాలపై బడి ఏడ్వసాగింగి సుభద్ర.

'జానకి.........'

'కాదు...మీ సుభద్రని మీ జీవిత భాగస్వామిని, మీ ప్రేమకు పాత్రురాలిని కానివ్వండి.'

'సుభద్రా' అంటూ ఆనందంగా లేవదీశాడు రాజశేఖర్. దోసిట్లో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్న భార్యని హృదయానికి కద్దుకున్నాడు రాజశేఖర్. ఆనందంతో కళ్ళొత్తుకున్నారు కృష్ణారావు. తేలికబడ్డ హృదయాలతో సంతోషంగా క్రిందకు వచ్చినవారు హాల్లోనే ఆగిపోయారు.

'ఆగు...ప్రదీప్ ఎంతమాటన్నావ్ ? ఇన్నిదినాలూ నాతో తిరిగి అంత సన్నిహితంగా వుండి నన్ను అర్థం చేసుకున్నదిదేనా? పూర్వపు బాధలకన్నా ఈ మాటతో నా హృదయాన్ని వ్రక్కలుచేశావ్ ...'

'మణీ! ఈ వక్కమాటకే ఇంత బాధపడుతున్నావే' నన్ను మరచిపో, ఇక నాకు కనిపించకు అని ఒక్కమాటలో తేల్చావే?' ఎలా అనగలిగావ్ ? ఇన్ని దినాలూ ఊహాలు రేగించి ఆశలు చూపించి, కోరికలను రేకెత్తించి, నీవు ఇంత ద్రోహం చేస్తావనుకోలేదు ..

'ద్రోహం! ప్రదీప్ నేను ద్రోహంచేశానా? నిన్ను వివాహం చేసుకోమన్నానే...'

'మణీ! వివాహం...హు! ఆమాట నేనంటె ఏమంటావ్ ? ఎందుకలా ఏడుస్తావ్ ?...పోనీ కనీసం నీ పెండ్లికి పిలుస్తావా మణీ? మరచిపొమ్మన్నావుగా పోనీ పిలవకున్నా ఆ దృశ్యాన్ని చిత్రించుకుని నా హృదయంలోనే దీవిస్తాను.'

'ఆగు ప్రదీప్ నిజంగా వస్తావా?'

'హు! అంత భాగ్యం కలుగజేస్తావా అని?...'

'అంతకంటేనా? ప్రదీప్ అలాగే వాతబియ్యంపట్రా'.

'మణీ!'

మౌనంగా రోధించసాగింది మణి.

'మణీ! మనల్నేదో అజ్ఞాతశక్తి విడదీస్తుంది. ఒక్కసారి ఇలా చూడు బహుశా ఇదే చివరిసారేమొ తిరిగి కలుసుకునేది ఆ లోకంలోనే' అంటూ హాల్లో అడుగుపెట్టిన ప్రదీప్ అలాగే నిలబడిపోయాడు.

'ప్రతీప్ అంత నిర్లక్ష్యంగా వెళ్ళకు' అంటూ బుజంమీద చేయివేశాడు రాజశేఖర్.

'మామయ్యా నీకింకా ఈ గ్రుడ్డి ప్రపంచంమీద నమ్మకం పోలేదా? అందరూ నీలాగే ప్రేమమూర్తులు వుంటారనుకోవటం మనదే బుద్ధితక్కువరా మామయ్యా వెళ్ళాం' అంటూ అడుగు ముందుకువేశాడు ప్రతీప్.

'ఆగు బాబూ ఇదంతా నావలన జరిగింది' అంటూ అంతవరకూ వారి సంభాషణ నిశ్చేష్టులై వింటున్న ఇద్దరూ కదిలివచ్చారు.

'రాజా! ఎవరబ్బాయి?' అంటూ ఆశ్చర్యంగా ప్రశ్నించారు కృష్ణారావు.

'నా చెల్లెలు శారద కొడుకు కృష్ణా! వీడివలననే నీ జాడ తెలిసింది సుభద్రా.'

'అయితే తెలిసే ఇంతవరకూ తీసుకువచ్చావా బాబూ?' అనుమానంగా ప్రశ్నించింది సుభద్ర.

అవునత్తయ్యా ఇన్నిదినాలూ ఈ రహస్యాన్ని మామయ్యకొరకే దాచానుకానీ.........

'ఫరవాలేదులే బాబూ వుండు' అంటూ గదిలో వెక్కి వెక్కి ఏడుస్తున్న రాజాని తీసుకువచ్చింది సుభద్ర.'

'రాజా! వీరు మీ నాన్నగారమ్మా!'

ఆశ్చర్యానందాలలో తల్లివైపు ప్రశ్నార్థకంగా చూచింది రాజ.

'అవునమ్మా నిన్నటినుండి నీకు చెప్పనేలేదు...'

'నాన్నా అంటూ రాజశేఖరం పాదాలు అద్దుకుంది రాజ. ఆనందంతో కూతురుని హృదయానికి హద్దుకున్నాడు రాజశేఖర్.

'ఇతనెవరో కాదమ్మా మీ బావ శారదాత్తయ ఏకైక పుత్రుడు' అని చెబుతున్న తండ్రి మాటలను ఆనందాశ్చర్యాలతో వింటున్న రాజా వదనంపై అప్రయత్నంగా విషాద రేఖలు అలుముకున్నాయి.

'సుభద్రా ఇకనైనా నీ పట్టుదల వదిలితే వారి జీవితాలు ఒకటౌతాయంటూ హెచ్చరించారు కృష్ణారావు గారు.'

'లేదన్నయ్యా ఇక నాకెలాంటి పట్టుదలలూ లేవు వారిద్దరూ కలకాలం సుఖంగా వుండాలనే నే కోరేది' అన్న సుభద్ర మాటలకు అందరి వదనాలు కాంతిగా వెలిగాయి. రాజ సిగ్గుతో తల వంచుకుంది.

'అందరం దైవ కృపవలన కలిశాం మనం చాలా అదృష్టవంతులం.'

'కలుసుకోక ఏంచేస్తాంరా? మనం మనుష్యులం మన మమతలే మనల్ని ఒకటిచేస్తాయి' అన్న కృష్ణారావు మాటలకు అందరూ హాయిగా అందంగా నవ్వుకున్నారు.

Edited and Published by A.N. Raghavachar, No, 32, Krishnappa Naick Tank St, Madras 1
Printed by R. Bakthavachalu Bharathamatha Press, No. 39, Anderson St;, Madras 1